## క్లుప్తంగా

### టీడీపీకి సీనియర్ నేత విజయ్ రాజీనామా



గోకవరం: గోకవరం మండలం రంపయర్రంపాలెంకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, పార్టీ మాజీ మండలాధ్యక్షుడు, పార్టీ కాకినాడ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ దొడ్డా విజయ్ ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. గోకవరం ప్రెస్‌క్లబ్ భవనంలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1994 నుంచి పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేశానన్నారు. అయినా సరిగా గుర్తించడం లేదని అన్నారు. ఈ పరిస్థితులపై మనస్థాపం చెంది పార్టీకి రాజీనామా చేస్తున్నానన్నారు. తన నిర్ణయాన్ని జిల్లా, రాష్ట్ర కమిటీకి తెలియజేస్తానన్నారు.

### భారీగా తరలివెళ్లిన వైఎస్సార్ సీపీ శ్రేణులు



ఏలేశ్వరం నుంచి తరలివెళుతున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

ఏలేశ్వరం: ప్రత్తిపాడు మార్కెట్ కమిటీ అభినందన సభకు పట్టణం నుంచి ఆదివారం వైఎస్సార్ సీపీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. వైఎస్సార్ సీపీ నేత, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ సామంతుల సూర్యకుమార్ ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియమితులైన పైల విజయ్‌కుమార్‌కు సంఘీభావంగా అభినందన సభకు ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. పట్టణానికి చెందిన పైలవిజయ్‌కుమార్‌ను డైరెక్టర్‌గా నియమించడంతో అభినందన సభ నిర్వహిస్తున్న ప్రత్తిపాడు మండలం రాచపల్లి వెళ్లారు. ఎంపీటీసీ సభ్యుడు యిజనగిరిప్రసాద్, కోరాడప్రసాద్, జామి ఆదినారాయణ, బూర్ల సత్తిబాబు, పతివాడ జగదీష్, సామంతుల చిన్నారావు ఆధ్వర్యంలో తరలి వెళ్లారు.

### వైభవంగా తలుపులమ్మతల్లి జాతర



మజ్జిగ పంపిణీ చేస్తున్న అక్షర గ్రూపు సేవాసంస్థ ప్రతినిధులు

కోటనందూరు: స్థానిక తుని–నర్సీపట్నం రోడ్డులో వేంచేసి ఉన్న శ్రీతలుపులమ్మతల్లి జాతర మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చి అమ్మవారిని దర్శించి మొక్కులు చెల్లించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. ఆలయ ప్రాంగణంలో సాయంత్రం నిర్వహించిన భారీ బాణసంచా కాల్పులు అందరినీ ఆకట్టుకున్నాయి.

**మజ్జిగ పంపిణీ**

తలుపులమ్మతల్లి జాతర సందర్భంగా భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఎండ వేడి, వడగాడ్పులు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో స్థానిక అక్షర గ్రూపు స్వచ్ఛంద సేవాసంస్థ, ఏవీఎం కోచింగ్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ, చల్లని మంచినీరు, పూజా సామగ్రి పంపిణీ చేశారు.

### విద్యుత్‌షాక్‌తో మహిళ మృతి

తొండంగి: మండలంలోని నర్సిపేటకు చెందిన మహిళ విద్యుత్‌షాక్‌తో మృతిచెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు తొండంగి ఎస్సై రవికుమార్ ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం నర్సిపేటకు చెందిన పోలవరపు నాగమణి(52) శనివారం ఇంటి వద్ద చేతి పంపు కొట్టేందుకు వెళ్లింది. విద్యుత్ మోటారు కూడా చేతిపంపునకు అమర్చి ఉండటంతో నాగమణి విద్యుత్‌షాక్‌కు గురై అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. దీంతో కుటుంబ సభ్యులు తుని ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. నాగమణి కుమారుడు అర్జున్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రవికుమార్ వివరించారు.

### చికిత్స పొందుతూ యువకుడి మృతి

రాజమహేంద్రవరం రూరల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న గండేపల్లి కొత్తపేటకు చెందిన పల్లి నాగసత్య శివసాయి ప్రసాద్‌రెడ్డి (23) శనివారం రాత్రి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. గండేపల్లి కొత్తపేటకు చెందిన సాయిప్రసాద్ రెడ్డి లాలాచెరువు టీ టైమ్‌లో పనిచేస్తున్నాడు. ఈ నెల 12వ తేదీ టీ టైమ్ నుంచి రాజానగరం మెటీరియల్ కోసం వెళ్లి తిరిగి వస్తున్నాడు. దివాన్ చెరువు వద్దకు వచ్చేసరికి ఐఓసీఎల్ పెట్రోల్ బంకు ఎదురుగా ముందువెళుతున్న కారు సడన్‌గా ఆగడంతో మోటారు బైక్‌తో ఢీకొట్టాడు. దీంతో తీవ్రగాయాలైన సాయిప్రసాద్ రెడ్డిని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి, అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని బొమ్మూరు ఎస్సై కె.జగన్‌మోహన్‌రావు తెలిపారు.

# అద్దె భవనంలో.. అరకొర వసతులతో..

- అర్ధ శతాబ్దం దాటుతున్నా సొంత బిల్డింగ్ లేదు
- ప్రత్తిపాడు ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం దుస్థితి



అద్దె భవనంలో కొనసాగుతున్న ప్రత్తిపాడు ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం

ప్రత్తిపాడు: స్థానికంగా ఎక్సైజ్ రేంజి కార్యాలయాన్ని ఏర్పాటు చేసి 50 ఏళ్ల దాటుతున్నా ఇంతవరకు ప్రత్తిపాడులో పక్కా భవనాన్ని నిర్మించకపోవడంతో సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. ఏటా కోట్లాది రూపాయల ఆదాయాన్ని సమకూర్చుతున్న ఎక్సైజ్ స్టేషన్‌కు పక్కా భవనం నిర్మించాలన్న ఆలోచన ఆ శాఖ ఏనాడూ చేయలేదన్నది వాస్తవం. 1968లో ప్రత్తిపాడు ఎక్సైజ్ రేంజ్ కార్యాలయాన్ని అద్దె ఇంటిలో ఏర్పాటు చేశారు. ఈ రేంజి పరిధిలో ఏలేశ్వరం, అన్నవరం, తుని, ప్రత్తిపాడు కేంద్రాలుగా ఎస్సై స్థాయిలో సిబ్బంది ఉండేవారు. ఆనాడు దీని పరిధిలో ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, తొండంగి, కోటనందూరు, కిర్లంపూడి, తుని మండలాలు ఉండేవి. సిబ్బంది తక్కువగా ఉండడం, వాహనాల కొరత, రేంజి పరిధి ఎక్కువగా ఉండడంతో సారా స్థావరాలపై దాడులకు చేసేందుకు సిబ్బందికి ఇబ్బందులు ఎదురయ్యేవి. దీంతో ఎక్సైజ్ శాఖ కసరత్తులు చేసి, రేంజి కార్యాలయాన్ని తొలగించింది. ఒక్కో రేంజ్‌ను రెండు ఎక్సైజ్ సర్కిల్ స్టేషన్లుగా విభజించి, పరిధిని కుదించారు. దీంతో ప్రత్తిపాడు ఎక్సైజ్ రేంజ్‌ని 1999లో ప్రత్తిపాడు, తుని కేంద్రాలుగా ఎక్సైజ్ సర్కిల్ స్టేషన్లుగా ఏర్పాటు చేశారు. రేంజి పరిధిలోని తుని, తొండంగి, కోటనందూరు మండలాలను తుని సర్కిల్‌లోకి, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, కిర్లంపూడి మండలాలతో పాటు ఆతర్వాత ఏర్పాటైన రౌతులపూడి మండలాన్ని ప్రత్తిపాడు సర్కిల్‌లోకి చేర్చారు. 2020 మే 16 నుంచి ఎక్సైజ్ సర్కిల్ రద్దు చేసి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోగా మార్పు చేశారు.

**వసతులు కరవు**

ప్రత్తిపాడులో ఏర్పాటు చేసిన ఎక్సైజ్ సర్కిల్ స్టేషన్ అరకొర వసతుల మధ్య కొట్టుమిట్టాడుతోంది. సిబ్బందికి, నిందితులకు అవసరమైన వసతులు లేనే లేవు. ఈ స్టేషన్‌కు రైటర్‌ను ఈనాటి వరకు నియమించనేలేదు. దాడుల్లో పట్టుబడిన వాహనాలు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఉండాల్సిందే. ఎండావానల బారిన పడిన ఈ వాహనాలు తుప్పుపట్టి, పాడవుతున్నాయి. అంతేగాక ఈవాహనాలకు వేలం నిర్వహించే సమయానికి పూర్తిగా పాడైపోయి, కనీస ధర పలకడం కూడా కష్టమవుతోంది. దీంతో వేలాది రూపాయల ఆదాయాన్ని ఎక్సైజ్ శాఖ కోల్పోతోంది.

**భవన నిర్మాణానికి కృషి చేస్తా**



గతంలో అప్పటి ఎక్సైజ్ సీఐ ఎం.అరుణకుమారి ఆధ్వర్యంలో ఎక్సైజ్ సర్కిల్ స్టేషన్ భవన నిర్మాణానికి స్థల సేకరణ ప్రయత్నాలు జరిగాయి. పంచాయతీ నుంచి అనుమతులు రాకపోవడంతో స్థల సేకరణ పెండింగ్‌లో ఉంది. అనుమతులు తీసుకుని, భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయమని ఉన్నతాధికారులకు నివేదిస్తా.

– పి.అశోక్, ఎస్ఈబీ సీఐ, ప్రత్తిపాడు

### గిట్టుబాటు ధరకు అమ్ముకునే చైతన్యం రావాలి

కిర్లంపూడి: రైతులు కష్టపడి పండించడమే కాకుండా ఉత్పత్తులను అమ్ముకునే సమయంలో వ్యాపార దృక్పథంతో ఆలోచించే చైతన్యం రావాలని నారాయణ సేవాసమితి రాష్ట్ర కోఆర్డినేటర్ బురగాడ సుజయ్ కుమార్ అన్నారు. కిర్లంపూడిలో ఆదివారం సంఘం చైర్మన్ అల్లు శివరామకృష్ణ అధ్యక్షతన అభ్యుదయ కర్షక ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీని సుజయ్‌కుమార్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా మండలానికి ఒకటి చొప్పున 10వేల ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీలను ప్రారంభిస్తోందన్నారు. భారతీయ కిసాన్ సంఘం రాష్ట్ర కార్యదర్శి యల్లపు సూర్యనారాయణ మాట్లాడుతూ మేలైన ఉత్పత్తుల ద్వారా వ్యాపారులను తమ దగ్గరకే రప్పించుకునే పరిస్థితులు రావాలన్నారు. దీనికోసం రైతులలో చైతన్యం నింపేందుకు ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీలు దోహదపడతాయన్నారు. కాకినాడ జిల్లా కోఆర్డినేటరు నీలం గనిబాబు, భారతీయ కిసాన్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శులు రాసంశెట్టి రాజా, సంఘం డైరెక్టర్లు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ గీత

ప్రత్తిపాడు రూరల్: రైతు సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని ఎంపీ గీత, ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని రాచపల్లిలో ప్రత్తిపాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలక వర్గ అభినందన సభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ జిగిరెడ్డి రమణమ్మ శ్రీను, వైస్ చైర్మన్ శేరు కృష్ణ, కార్యవర్గ సభ్యులను పూలమాలలు, శాలువాతో ఎంపీ, ఎమ్మెల్యే చేతుల మీదుగా సన్మానించారు. అనంతరం వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు శెట్టిబత్తుల కుమార్‌రాజా అధ్యక్షతన జరిగిన సభలో ఎంపీ వంగా గీత మాట్లాడుతూ ఏఎంసీ పాలక వర్గం రైతు సంక్షేమమే లక్ష్యంగా పని చేయాలన్నారు. తమ ప్రభుత్వం ఆర్బీకేల ద్వారా రైతుల చెంతకే సేవలు చేర్చిందన్నారు. రైతులను అన్ని విధాలా తమ ప్రభుత్వం బలోపేతం చేసిందన్నారు. ఆర్బీకేల ద్వారా విత్తనాల నుంచి పంట కొనుగోలు వరకు అన్ని సేవలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీలు పర్వత రాజుబాబు, గోళ్ల కాంతి సుధాకర్, ఏపీ సాహిత్య అకాడమీ డైరెక్టర్ మారిశెట్టి శివకుమార్, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఈగల అప్పారావు, ఏలేశ్వరం మున్సిపల్ కౌన్సిలర్ అలమండ చలమయ్య, సొసైటీ చైర్మన్‌లు గొంతిన సురేష్, చక్కపల్లి సత్తిబాబు, అన్నవరం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు దలే చిట్టిబాబు, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యం



రాచపల్లిలో పీహెచ్‌సీ భవనాన్ని ప్రారంభించిన ఎంపీ గీత, ఎమ్మెల్యే పర్వత

ప్రత్తిపాడు రూరల్: ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తుందని ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని రాజపల్లిలో రూ.1.50 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆదివారం వారి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తూ రాష్ట్రం దేశ స్థాయిలోనే రోల్ మోడల్‌గా నిలిచిందన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ప్రజల చెంతకే వైద్యం తీసుకెళ్లామన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా పేదోడి ప్రాణాలకు రక్షణ కల్పిస్తూ కార్పొరేట్ వైద్యం అందిస్తున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి ఆర్.ప్రవీణ్‌కుమార్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ గోళ్ల కాంతికుమార్, వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను, సర్పంచ్ సారిపల్లి లోవ లక్ష్మి పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి

గోకవరం: హనుమజ్జయంతిని గోకవరం మండలంలో పలు గ్రామాల్లో ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గోకవరం శివారున కొత్తపల్లికి వెళ్లే మార్గంలోని వరబాపనమ్మ ఆలయ సమీపంలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. వేదపండితులు ద్విభాష్యం సూర్యవెంకట సుబ్బారావుశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. గోకవరంలో స్థానిక మెయిన్‌రోడ్డులోని దాసాంజనేయస్వామి ఆలయంలో భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతిని పురస్కరించుకుని ఆలయ అర్చకులు ఆరవిల్లి సీతారామాచార్యులు వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాస్‌శర్మల ఆధ్వర్యంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. మురళీనగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. తంటికొండలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో వేంచేసియున్న ఆంజనేయస్వామి ఆలయంలో ఈఓ ఆర్‌వీ చందన ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. మండలంలోని పలు గ్రామాల్లో ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**ఘనంగా హనుమజ్జయంతి**

కిర్లంపూడి: మండలంలో హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం కిర్లంపూడి, గెద్దానాపల్లి, బూరుగుపూడి, జగపతినగరం గ్రామాల్లో వేంచేసిన ఆంజనేయస్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

**పలుచోట్ల అన్నదానాలు**

ఏలేశ్వరం: పవనపుత్రుడు హనుమంతుని జయంతి నియోజకవర్గవ్యాప్తంగా ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని షిర్డినగర్‌లోని గాంధీజీ విగ్రహం సమీపంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అభయాంజనేయస్వామి విగ్రహం వద్ద పండితులు పాన్నూరు సత్యనారాయణచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి తమలపాకుల పూజ, సిందూర పూజ నిర్వహించారు. అనంతరం భజన నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ సామంతుల సూర్యకుమార్, ఏఎంసీ డైరెక్టర్ పైల విజయ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యుడు యిజనగిరి ప్రసాద్ పాల్గొన్నారు. స్థానిక మార్కెట్‌వీధిలోని ఆంజనేయస్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. యర్రవరంలోని ఆంజనేయస్వామి వారి ఆలయంలో విశేష పూజలు చేశారు.



గోకవరం శివారులో ప్రతిష్ఠించిన ఆంజనేయస్వామి విగ్రహం



ఏలేశ్వరంలో అభయాంజనేయస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

**ఆంజనేయా.. అనుగ్రహించు**

గండేపల్లి: శ్రీ ఆంజనేయా మమ్ము అనుగ్రహించు అంటూ భక్తులు హనుమజ్జయంతిని ఆదివారం వేడుకగా జరుపుకున్నారు. మండలంలోని పలు గ్రామాలలో గల ఆయా కాలనీలలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయాలలో స్వామివారికి తమలపాకులు, నాగసిందూరంతో పూజలు నిర్వహించి వడమాలలు సమర్పించారు. పలు గ్రామాలలో గల ధర్మపీఠం సభ్యులు శ్రీరామ, జైరామ అంటూ కాషాయ జెండాలతో బైక్ ర్యాలీలు నిర్వహించి ధర్మోరక్షతి రక్షితః అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మల్లేపల్లి, తదితర గ్రామాలలో అన్న సమారాధనలు నిర్వహించారు. ఆంజనేయ మాలలు ధరించిన దీక్షాపరులు, భక్తులు ఈ కార్యక్రమాలలో పాల్గొన్నారు.

**తోరణాలతో అలంకరణ**

శంఖవరం: మండలంలోని జి.కొత్తపల్లిలో హనుమజ్జయంతి సందర్భంగా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు భారీగా తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయాన్ని మారేడు, నేరేడు తోరణాలతో అలంకరించారు. భజన బృందాలు గీతాలు ఆలపించాయి.

**భక్తిశ్రద్ధలతో..**

తుని రూరల్: ఆంజనేయస్వామి జయంతి సందర్భంగా భక్తులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఎస్.అన్నవరంలో శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం, కుమ్మరిలోవ తపోవనం ఆశ్రమం, లోవ దేవస్థానంలో హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఎస్.అన్నవరంలో అభయ దాసాంజనేయస్వామి, పంచముఖ ఆంజనేయస్వామికి అర్చకులు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్వామివారిని తమలపాకులు, నిమ్మకాయలు, వడలతో తయారు చేసిన మాలలతో అలంకరించి పూజలు చేశారు.



ఎస్.అన్నవరం ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో విశేష అలంకరణలో ఆంజనేయస్వామి

డి.పోలవరం, తేటగుంట, రాపాక, హంసవరం, టి.తిమ్మాపురం, వి.కొత్తూరు, కేఓ.మల్లవరం, రేఖవానిపాలెం తదితర గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలు జరిగాయి.

**తుని పట్టణంలో..**

తుని: పట్టణంలో హనుమజ్జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. తుని పట్టణంలో సూరవరం రోడ్డు, శ్రీరామ సెంటర్, ఫైర్ ఆఫీస్ సెంటర్, రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాల్లో ఆంజనేయస్వామి విగ్రహాల వద్ద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులను దర్శనానికి అనుమతించారు. రైల్వేస్టేషన్లో ఉన్న ఆంజనేయస్వామి గుడి వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

**పాత కొట్టాంలో శ్రీరామ గానామృతం**

కోటనందూరు: మండలంలోని పాతకొట్టాం రామాలయంలో శ్రీహనుమాన్ జయంతి సందర్భంగా ఆదివారం 'శ్రీరామ గానామృతం-హనుమద్వైభవం' కార్యక్రమం అంగరంగ వైభంగా జరిగింది. దేశవ్యాప్తంగా ఎంతో పేరు ప్రఖ్యాతులు సంపాదించిన కంభంపాటి సోదరులు (కృష్ణ ఆదిత్య-కృష్ణ శశాంక్) శ్రీరాముని దివ్య మహిమను వివరించే గానాలాపన, హనుమంతుని వైభవాన్ని వివరించారు.

# 2024లో మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డే సీఎం

**మాజీ ఎంపీ తోట నరసింహం**



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ నరసింహం

గోకవరం/జగ్గంపేట: 2024లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎంగా బాధ్యతలు చేపడతారని మాజీ ఎంపీ తోట నరసింహం పేర్కొన్నారు. కుమారుడి వివాహం నిమిత్తం నియోజకవర్గంలోని జగ్గంపేట, గోకవరం మండలాల్లోని ఆత్మీయులు, రాజకీయ నాయకులను ఆహ్వానించేందుకు ఆదివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా జగ్గంపేటలో మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత సీఎంగా జగన్ కనీవినీ ఎరుగని రీతిలో సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. ప్రజలు ఈ కార్యక్రమాల పట్ల ఆకర్షితులయ్యారని, పని చేసే నాయకుడికి ప్రజల ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. ఈ కారణంగానే రాబోయే ఎన్నికల్లో తిరిగి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టి సీఎంగా జగన్ రెండోసారి బాధ్యతలు నిర్వహిస్తారని చెప్పారు. సీఎం చేస్తున్న కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత తీసుకువెళ్లాలన్నారు. తన గురించి మాట్లాడుతూ మూడేళ్లుగా అనారోగ్యం కారణంగా రాజకీయాలకు దూరంగా ఉన్నానన్నారు. 2004 నుంచి నియోజకవర్గ ప్రజలు తనను ఎంతో ఆదరించి తమ కుటుంబానికి అండగా ఉన్నారన్నారు. 2004, 2009లో ఎమ్మెల్యేగా, 2014లో ఎంపీగా బాధ్యతలు నిర్వహించానని, 2010 నుంచి 2014 వరకు మంత్రిగా పని చేశానన్నారు. తాను అధికారంలో ఉండగా నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టానన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సహకారంతో రూ.609 కోట్లతో తోట వెంకటాచలం పుష్కర ఎత్తిపోతల పథకం తీసుకువచ్చానన్నారు. పలు లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల ద్వారా సాగునీరందించామని, ఈ విధంగా నియోజకవర్గంలో సుమారు 85 వేల ఎకరాలకు పైగా సాగునీరు వచ్చేందుకు కృషి చేశానన్నారు. పోలవరం కాలువ నిర్మించే క్రమంలో నిష్పక్షపాతంగా భూ సర్వే చేశామన్నారు. జగ్గంపేట మండలానికి తాగునీరు కూడా తీసుకువచ్చానన్నారు. జగ్గంపేటకు డిగ్రీ కళాశాల, ఫైర్ స్టేషన్ కూడా తన హయాంలోనే తీసుకువచ్చానన్నారు. ఎంపీగా ఉన్న కాలంలో నియోజకవర్గంలో సుమారు రూ.24 కోట్లు అభివృద్ధి పనులపై ఖర్చు చేసినట్టు చెప్పారు.

# ప్రజల దాహార్తిని తీర్చడమే లక్ష్యం

**ఎంపీ గీత, ఎమ్మెల్యే పర్వత ప్రసాద్**



ఒమ్మంగిలో రక్షిత మంచినీటి పథకాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ గీత, ఎమ్మెల్యే పర్వత

ప్రత్తిపాడురూరల్: ప్రజల దాహార్తిని తీర్చడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తుందని కాకినాడ ఎంపీ వంగా గీత, ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని ఒమ్మంగిలో రూ.68.15 లక్షలతో నిర్మించిన రక్షిత మంచినీటి పథకం వాటర్ ట్యాంక్‌ను వారి చేతుల మీదుగా ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల తాగునీటి సమస్య పరిష్కారానికి భారీగా నిధులు వెచ్చించినట్టు చెప్పారు. జల జీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ తాగునీరు అందిస్తామన్నారు. ఫలితంగా వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తలేదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జేసీఎఫ్ మండల ఇన్‌చార్జి రామిశెట్టి చిన్నబాబు, ఎంపీపీలు గోళ్ల కాంతి సుధాకర్, పర్వత రాజుబాబు, సొసైటీ చైర్మన్‌లు కొప్పన గంగారావు, గొంతిన సురేష్, అన్నవరం ట్రస్టుబోర్డు సభ్యుడు దలే చిట్టిబాబు, ఏపీ సాహిత్య అకాడమీ డైరెక్టర్ మారిశెట్టి శివకుమార్, స్థానిక వైఎస్సార్ సీపీ నేత రామిశెట్టి బుల్లి రామకృష్ణ పాల్గొన్నారు.

# కమ్ముకున్న పొగమంచు



గోకవరం-జగ్గంపేట ప్రధాన రహదారిలో కమ్ముకున్న పొగమంచు

గోకవరం: వేసవి కాలంలో సైతం పొగమంచు వీడటంలేదు. ఉదయం పొగమంచు కమ్ముకోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గోకవరం మండలం సింగారమ్మచింత మొదలుకొని జగ్గంపేట మండలం మల్లిసాల వరకు ఆదివారం ఉదయం పొగమంచు దట్టంగా కమ్ముకుంది. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక వాహనదారులు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉదయం 6 నుంచి 9 గంటల వరకు ఈ పొగమంచు కమ్ముకుంది.

# సాగర తీరంలో పర్యాటకుల సందడి

**బీచ్ రోడ్డులో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం**

కొత్తపల్లి: రోజురోజుకూ ప్రచండభానుడు ఉగ్రరూపం దాల్చడంతో ఎండవేడిమిని భరించలేక జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఈ క్రమంలో ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు ఉప్పాడ సాగర తీరానికి వెళ్తూ సేద తీరుతున్నారు. తీర ప్రాంతం ఆదివారం పర్యాటకులతో కళకళలాడింది. కడలి కెరటాల్లో కేరింతలు కొట్టారు. మండలం నుంచి వివిధ గ్రామాలతో పాటు పిఠాపురం, కాకినాడ, గొల్లప్రోలు, సామర్లకోట తదితర ప్రాంతాల నుంచి పర్యాటకులు ఉప్పాడ సాగరతీరానికి చేరుకున్నారు. అధిక సంఖ్యలో వాహనాలు రావడం వల్ల కాకినాడ-ఉప్పాడ బీచ్ రోడ్డులో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సీఐ శ్రీనివాస్, ఎస్సై రామలింగేశ్వరరావు సహా పోలీసులు వాహనాలను క్రమబద్ధీకరించారు. పర్యాటకుల ఆటల పాటలతో సాగర తీరం క్రీడా మైదానంగా మారిపోయింది. తుని సమీపంలో తలుపులమ్మతల్లి లోవ అమ్మవారిని దర్శించుకున్న భక్తులు మధ్యాహ్నానికి తిరిగి సాగర తీరానికి చేరుకున్నారు.



పర్యాటకులతో కిటకిటలాడిన ఉప్పాడ సాగర తీరం



బీచ్ రోడ్డులో నిలిచిపోయిన వాహనాలను క్రమబద్ధీకరిస్తున్న పోలీసులు